సాక్షి
పార్వతీపురం మన్యం

గురువారం । 6 । మార్చి । 2025

రూ.371 కోట్లతో ఉపాధి పనులు

రామభద్రపురం: జిల్లాలో ఈ ఏడాది ఉపాధి హామీ పథకం కింద రూ.371 కోట్లతో ఉపాధి హామీ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామని డ్వామా పీడీ శారదాదేవి అన్నారు. రామభద్రపురంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ 54,714 పనులు మంజూరు చేశామని 5 లక్షల 94 వేల మంది వేతనదారులు పనులు చేస్తున్నారన్నారు. ఏడాది 5 వేల ఎకరాల్లో ఉద్యాన పంటల అభివృద్ధికి కృషిచేస్తామన్నారు.

ముగిసిన కనకమహాలక్ష్మి జాతర

చీపురుపల్లి: భక్తుల కొంగుబంగారం కనకమహాలక్ష్మి అమ్మవారి 27వ జాతర మంగళవారం అర్ధరాత్రితో ముగిసింది. ఈ నెల 2, 3, 4 తేదీల్లో జరిగిన జాతరకు భక్తులు పోటెత్తారు. అమ్మవారిని దర్శించుకున్నారు. సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించేందుకు పెద్దఎత్తున తరలివచ్చారు. అర్ధరాత్రి 12 గంటలు సమయంలో బాణసంచా వెలుగులు విరజిమ్మాయి. బాణసంచా తిలకించిన అనంతరం భక్తులు వెనుదిరిగారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహార్
గురు (సా)	శుక్ర (ఉ)
6.07	5.02

న్యూస్‌రీల్

ఇంటర్ ఇంగ్లిష్-2 ప్రశ్న పత్రంలో ముద్రణా లోపాలు

పార్వతీపురంటౌన్: ఇంటర్ ఇంగ్లిష్-2 పరీక్ష ప్రశ్నపత్రంలో లోపాలు ఉండడంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ అన్నారు. ప్రశ్న పత్రంలో 8, 13 ప్రశ్నలు ముద్రణాలోపంతో విద్యార్థులకు స్పష్టంగా కనిపించలేదన్నారు. పరీక్ష ప్రారంభమైన 25 నిమిషాల తరువాత తప్పు జరిగింది, సరి చేసుకోమని పరీక్ష నిర్వాహకులు తెలియజేయడంతో విద్యార్థులు అయోమయంలో పడ్డారని, సమయం వృథా అయ్యిందన్నారు. కొన్ని సెంటర్లలో బ్లాక్ బోర్డుపై ప్రశ్నలు రాశారన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి కారకులైన బోర్డు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇంటర్మీడియట్ ఇంగ్లిష్-2 పరీక్షకు 394 మంది గైర్హాజరు


డీవీఈఓ మంజులవీణ

పార్వతీపురంటౌన్: జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ ఇంగ్లిష్ -2 పరీక్షలకు 394 మంది గైర్హాజరైనట్లు డీవీఈఓ మంజులవీణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లావ్యాప్తంగా 34 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 8520 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 8,216 మంది హాజరైనట్లు స్పష్టం చేశారు.

మాదలింగి సమీపంలో ఏనుగుల గుంపు


మాదలింగి గ్రామ సమీపంలో జొన్న పంటను ధ్వంసం చేస్తున్న గజరాజులు

కొమరాడ: మండలంలోని మాదలింగి, వన్నాం గ్రామ పంటపొలాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. జొన్న, కర్బూజా, అరటి, పామాయిల్ తదితర పంటలు చేతికొచ్చే సమయంలో ధ్వంసం చేస్తున్నాయంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం కుంకీ ఏనుగులు మాటలు కోటలు దాటాయేతప్ప ఏనుగుల తరలింపు ప్రక్రియ ఒక్క అడుగు ముందుకు పడలేదని రైతులు విమర్శిస్తున్నారు. ఏనుగులను తరలించకుంటే వ్యవసాయం విడిచిపెట్టి వలసపోవాల్సిందేనని వాపోతున్నారు.

మహిళా దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్: అంతర్జాతీయ మహిళాదినోత్సవ ఏర్పాట్లపై పార్వతీపురం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అధికారులతో కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ బుధవారం సమీక్షించారు. ఆహ్వాన పత్రికలను ముద్రించి మంత్రులు, ప్రజాప్రతినిధు లు, అధికారులను ఆహ్వానించాలన్నారు. మహిళా పారిశ్రామిక వేత్తలు, వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన నారీమణులను సత్కరించాలన్నారు. వేదిక వద్ద వివిధ రకాల స్టాళ్లతో పాటు ముఖ్యమంత్రి ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించేందుకు డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటుచేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో కె.హేమలత, జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి డా.టి.కనకదుర్గ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వెలుగుపథక సంచాలకులు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆశలు ఆవిరి



- అధ్యక్షా.. అనాలనుకున్న టీడీపీ నాయకుల ఆశలపై నీళ్లు
- ఉమ్మడి విజయనగరం నుంచి ఏ ఒక్కరికీ దక్కని ఎమ్మెల్సీ సీటు
- సార్వత్రిక ఎన్నికల్లో రెబెల్స్‌కు చంద్రబాబు గట్టి హామీ
- అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీ పదవిపై స్థానిక నాయకుల ఆశలు
- ఐదు ఖాళీల్లో అవకాశమిస్తారని అధిష్టానం వద్ద ప్రయత్నాలు
- కనీసం పరిశీలన జాబితాలోనూ పేరు లేకపోవడంతో నిరాశ!

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

శాసనసభకు వెళ్లడానికి వీలుగా టికెట్ ఇవ్వనప్పుడు కనీసం శాసనమండలికైనా వెళ్లి 'అధ్యక్షా...' అనడానికి అవకాశం వస్తుందని ఆశించిన స్థానిక టీడీపీ నాయకులకు నిరాశే ఎదురైంది. ఎప్పటివలే ఆ పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు తన మోసపూరిత మార్కు రాజకీయం చూపించారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను ఊరించి ఉసూరుమనిపించినట్టే .. పార్టీ నాయకులను ఎన్నికల్లో వాడుకుని ఇప్పుడు వదిలేశారు. దీనిపై ఆ పార్టీ నాయకుల అనుచరగణం భగ్గుమంటోంది. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎమ్మెల్సీ ఆశ చూపించి అన్యాయం చేశారని మండిపడుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చాక తొలిసారి ఎమ్మెల్యేల కోటాలో ఐదు ఎమ్మెల్సీ సీట్లను గెలుచుకునే అవకాశం వచ్చింది. దీంతో తమకు అవకాశం వస్తుందని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పలువురు టీడీపీ స్థానిక నాయకులు ఆశలు పెట్టుకున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల కాలంలో ఏ కోటాలో ఎమ్మెల్సీలను పంపడానికి అవకాశం వచ్చినా ఉత్తరాంధ్రకు పెద్దపీట వేసేవారు. అలా.. విజయనగరం జిల్లా నుంచి డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, ఇందుకూరి రఘురాజు శాసనమండలిలో అడుగుపెట్టడానికి అవకాశం వచ్చింది. సురేష్‌బాబుకైతే రెండోసారి కూడా ఎమ్మెల్సీ పదవి దక్కింది. అలాగే చంద్రబాబు కూడా తమకు అవకాశం ఇవ్వకపోతారా? అని ఆశించిన ఉభయ జిల్లాల నాయకులకు ఆశాభంగమైంది. ఒక అవకాశం ఇవ్వకపోతారా అని అధిష్టానం వద్ద విశ్వప్రయత్నాలు చేసినా తుదకు ఆశావహుల జాబితాలోనూ వారిని పరిగణనలోకి తీసుకోకపోవడం గమనార్హం.

నామినేటెడ్ పదవులతో సరి...

ఎమ్మెల్యే అవదామనుకున్న కర్రోతు బంగార్రాజు తనకు కనీసం ఎమ్మెల్సీ పదవి వస్తుందని ఆశించారు. కానీ ఆయనకు నామినేటెడ్ పదవి ఇవ్వడంతో మిన్నకుండక తప్పలేదు. ఆర్‌పీ భంజ్‌దేవ్, తెంటు లక్ష్మునాయుడు, కావలి గ్రీష్మలతో పాటు బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే సుజయ్ కృష్ణ రంగారావుకు కూడా నామినేటెడ్ పోస్టులు ఇచ్చారు. అలా వారు కూడా ఎమ్మెల్సీ సీటు ఆశించకుండా నీళ్లు చల్లేశారు. ఇక మిగిలింది గొంప కృష్ణ, కిమిడి నాగార్జున, బొబ్బిలి చిరంజీవులతో పాటు మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు. తమకు నామినేటెడ్ పదవి ఇవ్వలేదంటే ఎమ్మెల్సీ సీటు వస్తుందని ఆశలు పెట్టుకున్నారు. అధిష్టానం వద్ద విశ్వప్రయత్నాలు చేసినా చివరకు వారి పేర్లు పరిశీలనలోకైనా తీసుకోలేదని తెలిసి మౌనంగా ఉండిపోయారు.

ఊరించి.. ఉసూరుమనిపించి...

గత సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ టికెట్ వస్తుందని కర్రోతు బంగార్రాజు, గొంప కృష్ణ, కిమిడి నాగార్జున, బొబ్బిలి చిరంజీవులు, ఆర్‌పీ భంజ్‌దేవ్, తెంటు లక్ష్మునాయుడు, కేఏ నాయుడు, కావలి గ్రీష్మ... ఇలా పలువురు నాయకులు తమ నియోజకవర్గాల్లో పట్టు పెంచుకున్నారు. టికెట్ ఇవ్వకపోతే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎక్కడ టీడీపీ అభ్యర్థులకు దెబ్బ కొడతారోనని ఊహించిన చంద్రబాబు... వారందర్నీ 'ఎమ్మెల్సీ' ఆశల పల్లకి ఎక్కించారు. వారంతా మనసు మార్చుకొని పార్టీలో తమ పోటీదారులకు మద్దతు పలికారు. ఎలాగో గెలిచి పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో వారంతా అధిష్టానం తమకు ఇచ్చిన హామీ నెరవేర్చుతుందని ఆశించారు.

'కొల్ల'కైతే ఇప్పటికీ నిరాశే...

టీడీపీ అధిష్టానం హామీ ఇచ్చిందంటే ఎమ్మెల్సీ పదవి ఎంతవరకూ వస్తుందో టీడీపీ సీనియర్ నాయకుడు కొల్ల అప్పలనాయుడే ఓ ఉదాహరణ. రాజాం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని సంతకవిటి మండలంలో తూర్పుకాపు సామాజికవర్గానికి చెందిన ఆయన గతంలో ఎంపీపీగా మూడు పర్యాయాలు పనిచేశారు. మరో రెండు దఫాలు తన అనుచరులను ఎంపీపీ పదవిలో కూర్చోబెట్టారు. తన భార్యను కూడా జెడ్పీటీసీగా ఒక పర్యాయం గెలిపించారు. 2014 సార్వత్రిక ఎన్నికల్లో ఆయన్ను వాడుకొనే ఉద్దేశంతో చంద్రబాబు తాయిలం వేశారు. శ్రీకాకుళం జిల్లాపరిషత్ చైర్మన్‌ను చేస్తానని ఆశ చూపించారు. తీరా టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మొండిచేయి చూపించారు. చౌదరి బాబ్జీ భార్య చౌదరి ధనలక్ష్మికి చంద్రబాబు ఆ పదవి కట్టబెట్టారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన కొల్ల అప్పలనాయుడిని బుజ్జగించడానికి చంద్రబాబు ఎమ్మెల్సీ అస్త్రం ఉపయోగించారు. 2017 ఫిబ్రవరిలో స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు వచ్చాయి. అప్పుడు టీడీపీ టికెట్ తనకు ఇస్తారని ఆశించిన కొల్లకు చంద్రబాబు మళ్లీ జెల్లకొట్టారు. కాంగ్రెస్ పార్టీ నుంచి వలస వచ్చిన శత్రుచర్ల విజయరామరాజుకు ఆ టికెట్ ఇచ్చేశారు. దీంతో రెబెల్‌గా బరిలోకి దిగేందుకు కొల్ల అప్పలనాయుడు సిద్ధమయ్యారు. నాడు శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జి మంత్రిగానున్న పరిటాల సునీత, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు హుటాహుటిన కొల్ల స్వగ్రామం మామిడిపల్లి వెళ్లి మరీ ఆయనను బుజ్జగించారు. నామినేటెడ్ పదవి ఇస్తామని, సముచిత స్థానం కల్పిస్తామని హామీల వర్షం కురిపించారు. ఆ తర్వాత రెండేళ్ల పాటు టీడీపీ అధికారంలో ఉన్నా కొల్ల కల నెరవేరలేదు. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత అయినా కొల్లను కనీసం పట్టించుకోలేదు. అలా ఆయన 'ఎమ్మెల్సీ' ఆశ ఇప్పటికీ నెరవేరలేదు. అదీ చంద్రబాబు మార్క్ రాజకీయం.

శ్రీరాముడే ఆదర్శం

ఆధ్యాత్మిక ఉపన్యాసం చేస్తున్న చినజియర్ స్వామి



- సర్వజీవరాశులను కాపాడే బాధ్యత మనుషులదే..
- త్రిదండి చినజియర్ స్వామి


చినజియర్ స్వామి ఆశీర్వాదం తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు


తీర్థం తీసుకుంటున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ దంపతులు


ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

పార్వతీపురం: ప్రతి ఒక్కరూ శ్రీరాముడును ఆదర్శంగా తీసుకొని కుటుంబ, రాజ్యవ్యవస్థను నిర్వహించాలని త్రిదండి చినజియర్ స్వామి పిలుపునిచ్చారు. సర్వజీవరాశులను పరిరక్షించాల్సిన బాధ్యత మనుషులదేనన్నారు. పార్వతీపురం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వికాస తరంగిణి అధ్యక్షుడు యిండుపూరు గున్నేశ్వరరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన శ్రీరామ పాదుకా పట్టాభిషేకం వైభవంగా సాగింది. కార్యక్రమంలో పాల్గొన్న చినజియర్ స్వామి మాట్లాడుతూ పూర్వం సంప్రదాయలకు విలువ ఇచ్చేవారని, అందుకే వారంతా ఎంతో సుఖసంతోషాలతో జీవించేవారన్నారు. గత సంప్రదాయాలు నేర్పకపోవడం కారణంగా భావితరాల పిల్లలు తప్పులు చేస్తున్నారని, దీనికి తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సమాజంలో జీవించే ప్రతిఒక్కరూ మంచిని కోరుకోవాలన్నారు. సర్వమానవాళి ఆరోగ్యకరంగా ఉండాలంటే ప్రకృతిలో ఉండే అన్ని జీవరాశులను బతికిస్తూ మనం బతకాలన్నారు. ప్రకృతిని ధ్వంసం చేయడం వల్ల మానవుడు తనను తనే విధ్వంసం చేసుకుంటున్నాడన్నారు. పార్వతీపురంలోని జట్టు ఆశ్రమం నిర్వాహకురాలు పద్మజ చెత్తాచెదారాలను సేకరించి సంపదను సృష్టించడం వల్ల పర్యావరణం అభివృద్ధి చెందడంతో పాటు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు బాటలు వేస్తున్నారన్నారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. అనంతరం శ్రీరామ పట్టాభిషేకం పూజలను జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. పలువురు చిన్నారులు వేంకటేశ్వర స్వామి, ఆంజనేయుడు, పద్మావతి, లక్ష్మీ తదితర వేషధారణలతో అలరించారు. మహిళల కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కల్యాణమండపంలో భక్తులకు తీర్థం

పట్టణంలోని టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డులో ఉన్న కల్యాణమండపంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం చినజియర్ స్వామి స్వహస్తాలతో భక్తులందరికీ తీర్థం ఇచ్చారు. కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ దంపతులు, పార్వతీపురం అడిషనల్ జిల్లా జడ్జి ఎస్.దామోదర్‌రావు, మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు, న్యాయవాదులు టి.జోగారావు, వెంకటరావు, వైద్యులు డి.రామ్మోహనరావు, యాళ్ల వివేక్, పద్మజ, పి.వసంతకుమార్, జి.వాసుదేవరావు, వ్యాపారులు, నారాయణసేవకులు తీర్థగోష్ఠిలో పాల్గొన్నారు.


శ్రీరామపాదుకా పట్టాభిషేకంలో పాల్గొన్న భక్తులు

గిరిజన సర్పంచ్‌లంటే అంత చులకనా?


పాచిపెంట గిరిజన సర్పంచ్‌లతో కలిసి ఫిర్యాదు కాపీలను చూపిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

- హైకోర్టు తీర్పును ధిక్కరించిన అధికారులపై కోర్టుధిక్కరణ కేసు వేస్తాం
- సర్పంచ్‌ల ప్రమేయం లేకుండా అడ్డగోలు నిర్ణయాలు సరికాదు
- మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు రూరల్: గిరిజన సర్పంచ్‌లను చులకనగా చూస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్న హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తున్న అధికారులపై కోర్టు తీర్పుధిక్కరణ కేసు వేస్తామని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర స్పష్టంచేశారు. ఇంజినీరింగ్ అధికారులు గిరిజన సర్పంచ్‌లపై నిర్లక్ష్యధోరణి చూపుతున్నారంటూ పాచిపెంట మండలంలోని పలువురు సర్పంచ్‌లు రాజన్నదొర దృష్టికి బుధవారం తీసుకెళ్లారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేస్తామని ఫిర్యాదు కాపీని రాజన్నదొరకు ఆయన నివాసంలో అందజేశారు. దీనిపై మాజీ డిప్యూటీ సీఎం స్పందిస్తూ పార్వతీపురం జిల్లాలో పనిచేస్తున్న పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖ, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అధికారులు గిరిజన సర్పంచ్‌లను అవహేళన చేసి మాట్లాడడం తగదన్నారు. ఉపాధిహామీ అధికారి అల్లువాడ గోపాలకృష్ణ, సాలూరు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ టెక్నికల్ అసిస్టెంట్ గొట్టాపు సందీప్‌లు గిరిజన సర్పంచ్‌లను గౌరవించకుండా వ్యవహరిస్తున్నారని, వీరి తీరును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. మంత్రి చెప్పిన పనులు మాత్రమే చేస్తామని బహిరంగంగా చెబుతుండడం ఆగ్రహం వ్యక్తంచేశారు. 1994 సెక్షన్ 45 పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం సర్పంచ్‌ల హక్కులు, అధికారాలకు భంగం కలిగితే రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయడమేనని అన్నారు. ఆర్టికల్ 243 ద్వారా సర్పంచ్‌లకు అధికారాలు ఉన్నాయని, అలా కాకుండా అధికారులు సర్పంచ్‌లపై దురుసుగా వ్యవహరిస్తే ఎస్సీ, ఎస్టీ చట్టం 33/1989 ప్రకారం చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఉపాధి హామీ రిట్ పిటిషన్ నంబర్ 2174/2025పై ఫిబ్రవరి 3న ఉపాధి హామీ పనుల మీద హైకోర్టు ఇచ్చిన తీర్పును అధికారులు ధిక్కరిస్తున్నారన్నారు. పాచిపెంట మండలం గిరిజన సర్పంచ్‌లందరూ కలిసి ఏపీ గిరిజన శాఖ కమిషనర్, కలెక్టర్, జాతీయ మానవ హక్కుల సంఘం చైర్మన్‌కు అధికారుల తీరుపై ఫిర్యాదు చేస్తామన్నారు.

రూ.18 కోట్లతో 6 హాస్టల్స్‌కు భవనాలు

లక్కవరపుకోట: జిల్లాలో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 6 వసతి గృహాలకు ప్రధాన మంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ్ యోజన(పీఎం అజేయ్) పథకంలో భాగంగా రూ.18 కోట్లతో భవనాలను నిర్మించనున్నట్లు ఆశాఖ డీడీ బి.రామానందం తెలిపారు. ఈ మేరకు లక్కవరపుకోట మండల కేంద్రానికి బుధవారం వచ్చిన ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పీఎం అజేయ్ పథకంలో విజయనగరం-2, శృంగవరపుకోట-1, బొబ్బిలి-2, గజపతినగరం-1 చొప్పున ఆరు హాస్టల్స్‌ను ఒక్కో హాస్టల్‌కు రూ.3 కోట్లతో భవనాలను నిర్మించనున్నట్లు తెలిపారు. జిల్లాలో గల 23 వసతి గృహాల్లో రూ 4.67 కోట్లుతో మరమ్మతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో గల 30 సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న 102 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరవుతారన్నారు.

పోలమాంబ ఆరవ జాతర ఆదాయం రూ.4,57,524లు



మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి ఆరవ జాతర ఆదాయం ఈవో వి.వి.సూర్యనారాయణ సమక్షంలో బుధవారం లెక్కించారు. శీఘ్ర, ప్రత్యేక దర్శనం, కేశఖండనశాల టికెట్ల విక్రయం, అన్నదాన విరాళాలు, లడ్డూ, పులిహోర ప్రసాదం విక్రయంతో రూ.4,57,524లు ఆదాయం సమకూరిందన్నారు. లెక్కింపు కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల నూతన కార్యవర్గం


ఎన్నికైన జిల్లా నూతన కార్యవర్గం

పార్వతీపురంటౌన్: ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల మన్యం జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం పట్టణంలోని ఎన్‌జీఓహోమ్‌లో నిర్వహించారు. రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ ఎ.తిరుపతిబాబు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరగ్గా జిల్లా ప్రెసిడెంట్‌గా వై.తిరుపతిరావు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఆర్.శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్‌లుగా పి.రాజేష్, పి.మురళి, వి.నిర్మల, వి. చెల్లారావు, ఎం.గోపాలకృష్ణ, కార్యదర్శిగా ఆర్.సురేష్ కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీలుగా బి.రాము, లీలావతి, జి.సుమన్, ఎ.ఆనంద్, ఎస్ ఆదిలక్ష్మి, కోశాధికారిగా కె.కిశోర్, ఈసీ మెంబర్లుగా ఎం.అమరావతి, కె.గిరిబాబు, కె.శరత్ కుమార్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ఎస్ కిశోర్, ల్యాబ్ టెక్నీషియన్ల విజయనగరం జిల్లా అధ్యక్షుడు కేఎస్ అప్పల నాయుడు, ఎ.శంకర్రావు, కేవీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు మద్యం షాపుల లాటరీ

- కల్లుగీత, సొండి కులాలకు విజయనగరం జిల్లాలో 16, పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు షాపులు



సాక్షి ప్రతినిధి, విజయనగరం: ఉభయ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో కల్లుగీత, సొండి కులాలకు కేటాయించిన 20 మద్యం షాపులకు సంబంధించిన లాటరీ ప్రక్రియ గురువారం నిర్వహించనున్నారు. కూటమి ప్రభుత్వం కొత్త మద్యం విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చిన తర్వాత ఇప్పటికే విజయనగరం జిల్లాలో 153, పార్వతీపురం మన్యం జిల్లాలో 52 మద్యం దుకాణాలను ప్రైవేట్ వ్యాపారులకు అప్పగించిన సంగతి తెలిసిందే. వాటికి ఇప్పుడీ 20 అదనం. జిల్లా యూనిట్‌గా కల్లు గీత, సొండి సామాజికవర్గాల వారికి వీటిని కేటాయించారు. శెట్టిబలిజ, యాత, సెగిడి, శ్రీసైన, సొండి సామాజిక వర్గాలకు చెందినవారు విజయనగరం జిల్లాలోని 16 దుకాణాల్లో కోటా ప్రకారం ఎక్కడివాటికైనా దరఖాస్తు చేసుకోడానికి అవకాశం ఇచ్చారు. అలా 308 దరఖాస్తులు వచ్చాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో శ్రీసైన, సెగిడి, సొండి కులస్తులు నాలుగు దుకాణాల్లో కోటా ప్రకారం దరఖాస్తు చేసుకోవడానికి వెసులుబాటు కల్పించారు. దీంతో 60 దరఖాస్తులు దాఖలయ్యాయి.

'లాటరీ' ద్వారా కేటాయింపు...

జిల్లా యూనిట్‌గా కోటా ప్రకారం దరఖాస్తు చేసుకోవడానికి ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల చొప్పున ప్రభుత్వం ఫీజు నిర్ణయించింది. ఏ4 మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయిస్తారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకూ దరఖాస్తులు స్వీకరించారు. గత నెల 10వ తేదీన ఉభయ జిల్లాల్లో లాటరీ తీయడానికి ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వాయిదా వేశారు. ఆ ప్రక్రియను ఈ నెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ బి.శ్రీనాథుడు తెలిపారు. విజయనగరం జిల్లాలోని దుకాణాలకు సంబంధించి కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని ఆడిటోరియంలో ఉదయం 9 గంటలకు లాటరీ తీస్తారు. పార్వతీపురం మన్యం జిల్లాలో దరఖాస్తుదారులకు కూడా అదే సమయానికి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో లాటరీ నిర్వహిస్తారు.

మహిళల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

- ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి


పార్వతీపురం పట్టణంలో మహిళా సాధికారత ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి

పార్వతీపురంటౌన్: మహిళల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని, మహిళలు కూడా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్పీ ఎస్.వి.మాధవ్‌రెడ్డి సూచించారు. మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్, పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో హహిళలను గౌరవిస్తూ ఆత్మస్థైర్యం నింపాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని గుర్తుచేశారు. బాల్యవివాహ వ్యవస్థను నిర్మూలించేందుకు అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. బాలికలు సైబర్ నేరగాళ్ల మోసపూరిత మాటలు, ప్రలోభాలకు గురికారాదని హితవు పలికారు. ఆడపిల్లలు అన్నింటా రాణించాలంటే విద్య ఒక్కటే మార్గమని, ఏకాగ్రతతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశాభావం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఏఎస్పీ అంకిత సురానా, ఐసీడీఎస్ పీడీ డాక్టర్ టి.కనకదుర్గ, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.